హైదరాబాద్

వార్త



బుధవారం 29, మే 2013 16 పేజీలు



# ఎన్టీఆర్ బహుముఖ ప్రజ్ఞాశాలి

## జస్టిస్ చంద్రకుమార్



డాక్టర్ మనోజ్‌దాస్‌ను సత్కరిస్తున్న దృశ్యం

**రవీంద్రభారతి, మే 28, ప్రభాతవార్త:** ఎన్టీఆర్ బహుముఖ ప్రజ్ఞాశాలిఅని, తెలుగు జాతి ప్రతిష్టను విశ్వవాప్తం చేశారని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్ అన్నారు. యువకళావాహిని, ఎన్టీఆర్ విజ్ఞాన్ ట్రస్ సంయుక్తాధ్వర్యంలో ఎన్టీఆర్ జయంతి సందర్భంగా ఎన్టీఆర్ జాతీయ పురస్కారం ప్రదానోత్సవం, ప్రఖ్యాత ఒరియా రచయిత పద్మశ్రీ డాక్టర్ మనోజ్‌దాస్ సన్మాన కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ సినీమారంగం, రాజకీయ రంగాల్లో తనదైన ముద్ర వేసుకున్నారని చెప్పారు. పేదవారి కోసం అహరహం ఆరాటపడిన వ్యక్తిగా పేర్కొన్నారు. వారి పేరిట జాతీయ స్థాయిలో సాహితీ పురస్కారం రూపొందించి జాతీయ భాషా సాహితీవేత్తలకు ప్రదానం చేయటం ప్రశంసనీమన్నారు. ప్రఖ్యాత ఒరియా రచయిత, పద్మశ్రీ డాక్టర్ మనోజ్ దాస్ ఆంగ్ల, ఒరియా భాషల్లో అనేక రచనలు చేశారని చెప్పారు. వారి పురస్కారం ప్రదానం సముచితమని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా జ్ఞాన పీఠ్ అవార్డు గ్రహీత డాక్టర్ సి.నారాయణరెడ్డి మాట్లాడుతూ ఎన్నీఆర్ పురస్కారం తనకు కొంత ఆలస్యంగా గత ఏడాది లభించిందని చెప్పారు.

ఈ పురస్కారం తీసుకోవటానికి తనకు ఇష్టంలేదని, ఎన్టీఆర్ విజ్ఞాన్ ట్రస్ట్ అధ్యక్షురాలు ఎన్.లక్ష్మిపార్వతి వత్తిడి మేరుకు తాను స్వీకరించానని చెప్పారు. తానకు పురస్కారాన్ని ప్రదానం చేయటమంటే, ఎన్టీఆర్‌కు పురస్కారం ప్రదానం చేసినట్లేనని, తమిద్దరి మధ్య అంత అవినాభావ అనుబంధముందని వివరించారు. ఎన్టీఆర్ బహుముఖ ప్రజ్ఞాశాలి అని ఆయన నటనా, దర్శకత్వ, సినీ కథా, పాట రచనలో తనదైన బాణీని ప్రదర్శించారని చెప్పారు. అంతేకాకుండా రాజకీయ రంగంలోనూ ఎనలేని ప్రత్యేకతను ప్రదర్శించారని,రెండు పర్యాయాలు గిన్నీబుక్‌లోకి ఎక్కిన తెలుగు నటుడని కొనియాడారు. విశిష్ట అతిథిగా విచ్చేసిన సమాచార హక్కు కమిషనర్ పి.విజయబాబు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో రాజకీయరంగంలో సమూల మార్పులు తీసుకువచ్చిన, విశిష్ట పథకాలకు రూపకల్పన చేశారని గుర్తు చేశారు. ఎన్టీఆర్ విజ్ఞాన్ ట్రస్ట్ కార్యనిర్వాహక కార్యదర్శి, సాంస్కృతిక శాఖ మాజీ ముఖ్య సలహాదారులు డాక్టర్ కె.వి.రమణాచారి మాట్లాడుతూ 1992లో తిరుపతిలో ఎన్టీఆర్ విజ్ఞాన్ ట్రస్ ద్వారా జాతీయ సాహితీ పురస్కారాలు ప్రదానం చేయాలని లక్ష్మీపార్వతి నిర్ణయించి తొలుత కన్నడ సాహితీవేత్తకు పురస్కారం ప్రదానం చేసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా ప్రముఖ నాటక రచయిత డాక్టర్ డి.విజయభాస్కర్ సన్మాన పత్రాన్ని చదవగా, ప్రొఫెసర్ మృణాళిని పద్మశ్రీ డాక్టర్ మనోజ్‌దాస్‌ను సభకు పరిచయం చేశారు. ఈ కార్యక్రమంలో జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత డాక్టర్ రావూరి భరద్వాజ, కళావాచస్పతి లంకలక్ష్మినారాయణ, యువకళావాహిని వ్యవస్థాపక అధ్యక్షులు వై.కె.నాగేశ్వరరావు, పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎన్.లక్ష్మిపార్వతి సాహితీవేత్తలను సముచిత రీతిలో సన్మానించారు. ఈ సందర్భంగా ప్రదర్శించి దుర్యోధన ఏకపాత్రాభినయం, మిమిక్రీ కళాకారుడు రమేష్ ప్రదర్శనలు సభికులను అలరించాయి.

**ఎన్టీఆర్ పురస్కారం సంతృప్తినిచ్చింది.**

ఎన్టీఆర్ జాతీయ సాహితీ పురస్కారం సంతృప్తినిచ్చిందని ప్రఖ్యాత ఒరియా రచయిత పద్మశ్రీ డాక్టర్ మనోజ్‌దాస్ అన్నారు. నన్నయ్య కాలం నుంచి తెలుగు భాషా వికాసం అఖండితంగా విరాజిల్లుతున్నదని చెప్పారు. తెలుగు భాషలో తనకు పరిచయం ఉందని, బాలల సాహిత్య మాసపత్రిక చందమామతో తనకు సన్నిహిత సంబంధముందన్నారు. తనకు ఎన్నో పురస్కారాలు వచ్చాయని అయితే భాషా సౌందర్యం కలిగిని చోట నుంచి పురస్కారం పొందటం తమ విశిష్టతగా పేర్కొన్నారు.